క్లుప్తంగా

బాల్య వివాహాలతో పలు ఆరోగ్య సమస్యలు

మంగళగిరి: నగరంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ మాధవీలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందని, దీనివల్ల కుటుంబ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. పౌష్టికాహార లోపం వల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. చిన్నతనం నుంచే సీ విటమిన్ ఆహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ సీహెచ్. కుమారి, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీకి స్పందన



మంగళగిరి: నగరంలోని గణపతీనగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళా సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి. అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సైకిల్ తొక్కడంతో క్యాన్సర్ తదితర వ్యాధుల నివారణతో పాటు ఒత్తిడి, బీపీ, షుగరులను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో రౌడీషీటర్ అరెస్టు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి వెంబడి ఉన్న ఓ భూ వివాదంలో పెదవడ్లపూడికి చెందిన ఓ రౌడీషీటర్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. భూ వివాదానికి సంబంధించి రౌడీషీటర్ వద్ద నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సదరు భూమిలో ఎవరైనా అడుగుపెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల దగ్గర నుంచి డైరెక్ట్ పంపింగ్ ప్రాంతాల్లో ఉన్న పైప్‌లైన్ వాల్వ్స్ వద్ద తాగునీరు వృథాగా పోతుండటంతో గురువారం సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి మాట్లాడుతూ కొలనుకొండలో ఐదు చోట్ల తాగునీటిని ప్రాంతాల వారీగా మళ్లించేందుకు వాల్వ్స్ ఏర్పాటు చేశారన్నారు. వాటి వద్ద తాగునీరు వృథాగా పోతుండటంతో మరమ్మతులు చేసినట్లు చెప్పారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పరిశీలన



తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్ని గురువారం క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పరిశీలించారు. తాడేపల్లిలోని ఆశ్రమం రోడ్డులో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులు, వడ్డేశ్వరంలో 342 మీటర్ల పొడవునా నాలుగు సీసీ రోడ్ల నిర్మాణాల నాణ్యతను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నట్లు వారు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. కాలనీకి బకింగ్‌హామ్ కెనాల్ నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే మోటార్ మరమ్మతులకు గురై తాగునీటి సరఫరా ఆగడంతో ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ తెలిపారు.

వేసవిలో తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు కృషి

- వేసవిలో తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు కృషి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఫిరంగిపురం: వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ త్వరలో రెండు కోట్ల రూపాయలతో జలజీవన్ పథకం ద్వారా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా చేయనున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ప్రతి గ్రామంలో పీహెచ్‌సీ వైద్యుడు, 104 వాహనం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. జగనన్న గృహ సంకల్పంలో భాగంగా కేటాయించిన ఇళ్ల నిర్మాణాల్ని లబ్ధిదారులు పూర్తి చేసుకొనే విధంగా చూడాలని చెప్పారు. రైతులకు అవసరమైన టార్పాలిన్ పట్టాలు, తైవాన్ స్ప్రేయర్లు అందేలా చూస్తామని చెప్పారు. నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్ లేనందువల్ల ఇబ్బంది పడుతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, త్వరలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సమావేశాలలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారుల్ని ప్రశ్నించడం ద్వారానే పరిష్కారం అవుతాయని చెప్పారు. అనంతరం పలు శాఖల అధికారులు తాము చేపట్టిన పనులు గురించి తెలియజేశారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమస్యల్ని ఏకరువు పెట్టారు. తక్కెళ్లపాడు నుంచి 14వ మైలు మీదుగా కొర్రపాడు రోడ్డును ఇంతవరకు ప్రారంభించ లేదని, దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే నూతన భవనాల పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కుక్కలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు తెలిపారు. గ్రామాల్లోని సచివాలయం, ఆర్బీకే కేంద్రాల్లో నిర్వహించే సమావేశాలకు తమను పిలవడం లేదంటూ ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 11 గంటలకు నిర్వహించాల్సి సమావేశం 12 గంటల వరకు నిర్వహించకపోవడంతో కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశం నుంచి బయటకు వచ్చారు. తరువాత ఎంపీడీవో డి.అనూరాధ వెళ్లి నిర్వహిస్తున్నట్లు తెలపడంతో సమావేశ మందిరంలోకి వచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, వైస్ ఎంపీపీలు మార్పుల విజయలక్ష్మి, గుమ్మడి చంద్రం, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీవో డి.అనూరాధ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

మేడికొండూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మేడికొండూరు మండలం జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం మెగా జాబ్‌మేళాను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ కంపెనీల భాగస్వామ్యంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్న సీఎం కల సాకారం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. యువత లక్ష్య సాధన దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తే ఎంతటి కష్టమైనా పని కూడా విజయవంతం అవుతుందని సూచించారు. జీవితంలో సాధించాలనే లక్ష్యం ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, ముత్యాల బాలస్వామి, గండికోట రసూల్, పాముల పాటి వెంకటకృష్ణయ్య, కొరివి కిశోర్, షేక్‌రబ్బాని, నాగేశ్వరరావు, జిలాని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడేపల్లి రూరల్ : ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన అచ్చి మల్లయ్య, భార్య మంగమ్మ (47) ఈనెల 14న చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. నులకపేట తహసీల్దార్ కార్యాలయం దగ్గర మద్యం మత్తులో ఉన్న కాకుమాను భాగ్యేశ్వరరావు ద్విచక్ర వాహనంతో మల్లయ్య, మంగమ్మ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధురాలు...

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరుకు చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిలువూరుకు చెందిన వడ్డేశ్వరం వెంకటరత్నం (60) అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 13న కలుపు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడే మృతి చెందడంతో కుమార్తె మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గజ వాహనంపై భక్తులకు మల్లేశ్వరుడు దర్శనం



మంగళగిరి: నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం స్వామి గజ వాహనంపై దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు దర్శించుకుని, టెంకాయలు సమర్పించుకుని హారతులిచ్చారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజారు నుంచి శాసన స్తంభం, పూల మార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెద్ద కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినిధులు స్వామి గజ వాహన ఉత్సవానికి కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

శివరాత్రికి శైవ క్షేత్రాలు సిద్ధం



తాడికొండ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. తాడికొండ కొండపై ఉన్న గంగాభ్రమరాంబ సమేత శ్రీ కొండ మల్లికార్జునస్వామి ఆలయం, లాంలోని గంగా ఉమా సహిత సోమేశ్వరస్వామి ఆలయం, తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం శైవ క్షేత్రం ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. తాడికొండ కొండపైకి భక్తులు వెళ్లేందుకు వీలుగా ఘాట్ రోడ్డు మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయి. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ట్రాక్టర్ ట్రాలీల్ని ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు యథావిధిగా పైకి వెళ్లేందుకు గానూ మట్టి రోడ్డును చదును చేస్తున్నారు. వీటితో పాటుగా రెండు మండలాల్లోని పలు శివాలయాల్లో శివరాత్రి జాగరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు వెల్లడించారు.

స్టార్టప్‌ల పైనే దేశ భవిష్యత్తు



సదస్సును ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సీఈవో చౌదరి

తాడేపల్లి రూరల్ : దేశ భవిష్యత్తు పూర్తిగా స్టార్టప్‌ల పైనే ఆధారపడి ఉందని టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ సీఈవో జె.ఎ.చౌదరి అన్నారు. వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రపంచ సామాజిక ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, నూతన ఆవిష్కరణ నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి స్టార్టప్‌లతో ముందుకు రావాలని యువతకు పిలుపునిచ్చారు. నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలని విద్యార్థులకు సూచించారు.మహిళా సాధికారత కోసం టెక్నాలజీని ఉపయోగించుకోవాలని చెప్పారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జి. పార్థసారథి వర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మంచి ప్రారంభ ఆలోచనలతో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ముందకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్, స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ ఎ. శ్రీనాథ్, ప్రో వైస్ చాన్సలర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ. జగదీష్, సాక్ అసోసియేట్ డీన్ కె. రూతురమ్య, మహిళా సాధికారత ప్రో ఇన్‌చార్జి కె. సోని పాల్గొన్నారు.

నిషేధిత ప్రాంతంలో అర్ధరాత్రి అక్రమ క్వారీయింగ్

పోలీసు, రెవెన్యూ అధికారులకు స్థానికుల ఫిర్యాదు



అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురంలో ఇరువర్గాల మధ్య వివాదాస్పదంగా మారిన నిషేధించిన ప్రాంతంలో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ క్వారీయింగ్ నడుస్తోంది. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు రాత్రి సమయాల్లో జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో కొండ పోరంబోకు ప్రాంతంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ కొండపై నిర్మించిన ఇరువర్గాలకు చెందిన ఆలయాల నిర్మాణం వ్యవహారం ఇప్పటికే వివాదాస్పదంగా మారింది. దీంతో ఎవరినీ ఈ ప్రాంతంలో నిర్మాణాలు గానీ, కార్యకలాపాలు గానీ నిర్వహించవద్దని రెవెన్యూ, పోలీసు అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోల స్వయం పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు సంయమనం పాటించాలని సూచించిన నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రాంతంలో నిషేధం కొనసాగుతోంది. కానీ అర్ధరాత్రి కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు జేసీబీ, ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యల నిమిత్తం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలు చేస్తే జరిమానా, జైలు



విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో, సిబ్బంది

తాడికొండ: ఆడపిల్లకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే రూ.1 లక్ష జరిమానా, జైలుశిక్ష పడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కె. సింహాచలం తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై గురువారం తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహనా సదస్సు, ర్యాలీకి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల్ని విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాల కారణంగా గర్భం దాల్చితే మాతా, శిశు మరణాలు సంభవిస్తాయని సూచించారు. విద్యార్థి దశలో ఆకర్షణకు లోనుకాకుండా కష్టపడి చదివి ఉన్నతస్థితికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై. శ్రీలత, కె. కృష్ణ కుమారి, మహిళా పోలీసులు జయవర్ధని, నాగ రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

'క్లీన్ మంగళగిరి' సాధనకు సహకరించాలి

మంగళగిరి: క్లీన్ మంగళగిరి సాధనకు ప్రజలంతా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ యు. శారదాదేవి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తడి-పొడి చెత్త హానికర వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వేస్ట్‌లను విడివిడిగా విభజించి అందజేయాలని కోరారు. రోడ్లు, డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో చెత్త పడవేయకుండా ప్రతి రోజూ ఇళ్లకు వచ్చే క్లాప్ ఆటో వారికి అందజేయాలని సూచించారు. యూజర్ చార్జీల్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, వాటిని ఆటోల నిర్వహణకు, ఇంధన ఖర్చులకు, మరమ్మతులకు, డ్రైవర్ల జీత భత్యాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యతను గుర్తించాలని ఆమె సూచించారు.

సోషల్ మీడియా కన్వీనర్ల పాత్ర కీలకం



కన్వీనర్లతో మాట్లాడుతున్న నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేసే ప్రతి అడుగులో, పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కన్వీనర్లది కీలక పాత్ర అని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నూతనంగా ఎన్నికైన కన్వీనర్లు కత్తెరను మర్యాదపూర్వకంగా కలసి శాలువా, పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న పనులు, సంక్షేమ పథకాల్ని ప్రజలకు తెలియజేసే వారధిలా సోషల్ మీడియా కన్వీనర్లు పని చేయాలని సూచించారు.

మైనార్టీల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని తదితరులు

తాడేపల్లి రూరల్ : మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పాలనలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అన్ని రంగాల్లో వారికి సముచిత స్థానం కల్పించింది మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి మాత్రమేనని తెలిపారు. నలభై సంవత్సరాల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు తన హయాంలో మైనార్టీలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సంవత్సరానికి ఒక్కసారి రంజాన్ పండుగకు ఇచ్చే 200 రూపాయల తోఫాతో ముస్లింల జీవితాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధ్యం అవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఒక ఉప ముఖ్యమంత్రిని నియమించి మైనార్టీ పక్షపాతిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, పఠాన్ మస్తాన్ వలి, సయ్యద్ జానీ, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

28న చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు

మంగళగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రెండువేల కోట్ల రూపాయిలు కేటాయించాలని కోరుతూ ఈనెల 28న ఉదయం 10 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాల్లో చేనేత కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ధర్మవరంలో ఈనెల 15న జరిగిన ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు నిర్ణయాల్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2023–24 బడ్జెట్‌లో చేనేతకు రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, నేతన్న నేస్తం పథకం ప్రతి కార్మికునికి అమలు జరపాలని, చేనేత కార్మికులకు మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు ప్రభుత్వమే ఉచితంగా నిర్మించి ఇవ్వాలని కోరారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ల చట్టం అమలు జరపాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చేనేతపై విధించిన జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 45 సంవత్సరాలకే పెన్షన్ స్కీమ్ అమలు జరపాలని, చేనేత సహకార సంఘాలకు బకాయిల నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు.

వడ్డేశ్వరం పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీలు



పిల్లలతో కలసి భోజనం చేస్తున్న డీఈవో శైలజ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో గుంటూరు జిల్లా డీఈవో శైలజ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.45కు వచ్చిన ఆమె విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలలో భోజనం చేయని ప్రతి ఒక్క విద్యార్థి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా పాఠశాలలోనే పౌష్టికాహారం తినే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌లను ఏ విధంగా ఉపయోగిస్తున్నారో పరిశీలించారు. చాలామంది సిలబస్ ప్రకారం ట్యాబ్‌లు వినియోగించకపోవడాన్ని ఆమె గమనించి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు అందిస్తామని హెచ్చరించారు.

ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమరావతి సర్కిల్ మేనేజర్ నారాయణశర్మ

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్‌లో భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రిటైల్ ఆస్తుల రుణ కేంద్రం సెంటర్లను అమరావతి సర్కిల్ మేనేజర్ నారాయణశర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు త్వరితగతిన సేవలు అందించడానికి ఈ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు పరిపాలనా కేంద్రం డెప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, మంగళగిరి ప్రాంతీయ వ్యాపార కార్యాలయం రీజనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, ఏజీఎం పీఆర్‌కే రామకృష్ణ, ఆర్ఏసీసీ చీఫ్ మేనేజర్ కోటేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలి

కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి



ఉండవల్లిలో తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో కృష్ణా జలాలు అందించేందుకు వేస్తున్న కొత్త పైపులైన్ నిర్మాణ పనుల్ని డీఈ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండవల్లిలో రెండు చోట్ల 9 ఎంఎల్‌డీ శాండ్ ఫ్రైజర్ ట్యాంకుల్ని ఏర్పాటు చేశామన్నారు. అయితే, వాటిని పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆర్కే చివరి ప్రాంతాలకు నీరు సరిగ్గా చేరడం లేదని, వెంటనే కొత్త పైపులైను వేయాలని సూచించారని చెప్పారు. మొత్తం 3 కి.మీ. మేర రూ. 29 లక్షలతో కొత్త పైపులైన్లువేస్తున్నట్లు ఆయన తెలిపారు. దళితవాడలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ వరకు కొత్త పైపులైన్లు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ కిశోర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సందీప్ పాల్గొన్నారు.

శివరాత్రికి కైలాసగిరి ఆలయం ముస్తాబు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



కొండపైకి నూతనంగా ఏర్పాటు చేసిన తారురోడ్డు

మేడికొండూరు: పేరేచర్ల సమీపంలో కైలాసగిరి పుణ్యక్షేత్రం శివరాత్రికి ముస్తాబైంది. 18వ తేదీ ఉత్సవం సందర్భంగా లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్, మేడికొండూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య ఆధ్వర్యంలో కొత్త కళ సంతరించుకుంది. కమిటీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు అభివృద్ధి పనులు జరిగాయి. ప్రధానంగా కొండపైకి తారు రోడ్డు, ఆలయ మండపం, నిత్య అన్నదానం వసతి కల్పించారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భారీ విద్యుత్ ప్రభను లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది భక్తులను కైలసాగిరి కొండ శివరాత్రికి ఆకట్టుకునే విధంగా భారీ ఏర్పాట్లను చేస్తున్నారు.